
సాక్షి
పార్వతీపురం మన్యం
ఆదివారం । 18 । జూన్ । 2023



ప్రారంభానికి సిద్ధమైన వంతెన
పదకొండేళ్లుగా ఈ ప్రాంత ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్న కిమ్మి - రుషింగి వంతెన పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధమైంది. - 8లో



పోలవరంతో కొండగండ్రేడును సస్యశ్యామలం చేస్తాం..
పోలవరం ప్రాజెక్టు పూర్తయితే కొండగం డ్రేడు ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని ఛైర్మన్ అన్నారు. - 8లో



అదుపు తప్పి కారుపై పడిన ట్రాక్టర్
జాతీయ రహదారిపై కర్రల లోడుతూ వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి కారుపై బోల్తా పడింది. - 8లో

న్యూస్‌రీల్

పైడితల్లిఆలయ విస్తరణకు లైన్ క్లియర్



షాపుల వర్తకులకు బకాయిల చెక్కును అందజేస్తున్న ఈఓ సుధారాణి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి చదురుగుడి విస్తరణకు లైన్ క్లియర్ అయిందని ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి తెలిపారు. ఆలయానికి ఇరువైపులా ఉన్న నాలుగుషాపుల యజమానులకు పూర్తిస్థాయిలో బకాయిలు చెల్లించామన్నారు. ఆలయ ఆవరణలో షాపుల వర్తకులకు శనివారం రూ.25లక్షల36వేల311ల విలువైన చెక్కును ట్రస్ట్ బోర్డు ప్రతినిధుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేతనం వితరణ



మొదటి నెల వేతనాన్ని అందిస్తున్న గవర మధుసూదనరావు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణానికి తోటపల్లి గ్రామానికి చెందిన గవర మధుసూదనరావు దంపతులు తమ కుమార్తె మేఘన ఒక నెల వేతనం వితరణగా ఆలయ నిర్వాహకులకు శనివారం అందజేశారు. బ్యాంకులో ఉద్యోగం రావడంతో మొదటి నెల వేతనం స్వామివారి ఆలయ నిర్మాణానికి విరాళంగా అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది ఎం.మురళీ మోహన్ పాల్గొన్నారు.

23న 'జగనన్న సురక్ష' ప్రారంభం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 23న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు ముఖ్యమంత్రి కార్యాలయ సెక్రటరీ ఆర్.ముత్యాలరాజు, అదనపు సెక్రటరీ డా.ఎస్. భరత్‌గుప్తా తెలిపారు. జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కార్యక్రమ అమలుపై మార్గనిర్దేశం చేశారు. జూలై 1న ప్రారంభమైన కార్యక్రమాన్ని ఆగస్టు 1వ తేదీతో ముగించేలా రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్ కుమార్, జేసీ ఆర్.గోవిందరావు పాల్గొన్నారు.

ఠారెత్తిస్తున్న ఎండలు

- పార్వతీపురంలో 42.9 డిగ్రీల ఉష్ణోగ్రత



ఎండవేడిమికి శీతలపానీయాలు తాగుతున్న మహిళలు

పార్వతీపురంటౌన్: భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఉదయం 9 గంటలకే భగ్గుమంటున్నాడు. పార్వతీపురం పట్టణంలో వారంరోజులుగా 41 నుంచి 42.9 డిగ్రీల గరిష్ట, 32 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వర్షాల కోసం రైతన్నలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

విద్యతోనే భవిష్యత్తు



జగనన్న ఆణిముత్యాలు కింద విద్యార్థినికి ప్రోత్సాహక నగదు రూ.50వేల చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎమ్మెల్యే జోగారావు

- విద్యార్థుల చదువులే రాష్ట్రానికి పెట్టుబడి
- సర్కారు బడులు, కళాశాలల్లో ప్రమాణాలతో కూడిన విద్యాబోధన
- పదోతరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాస్థాయి ప్రతిభావంతులకు సత్కారం
- జగనన్న ఆణిముత్యాలు కింద అవార్డులు అందజేసిన కలెక్టర్, ఎమ్మెల్యే

పార్వతీపురంటౌన్: విద్యతోనే విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్తు సొంతమవుతుందని, విద్యార్థుల చదువులే రాష్ట్ర పెట్టుబడిగా ప్రభుత్వం భావిస్తూ విద్యారంగ అభివృద్ధికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయిస్తోందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. మనిషి వ్యక్తిత్వ వికాసానికి, సమాజ అభివృద్ధికి విద్యార్థి దశ కీలకమని స్పష్టం చేశారు. జిల్లాస్థాయిలో పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను పార్వతీపురంలోని సి-కన్వెన్షన్ సెంటర్లో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 'జగనన్న ఆణిముత్యాలు' కింద సత్కరించారు. పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి విద్యార్థులకు నగదు, ప్రశంసా పత్రం, మెడల్‌ను అందజేశారు. విద్యార్థుల ఉత్తమ ఫలితాలకు కారకులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులను దుశ్శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారుల సమష్టికృషి, ప్రభుత్వం కల్పించిన సదుపాయాలతోనే ఇది సాధ్యమైందన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. నాడు-నేడు కింద మొదటివిడతలో రూ.145 కోట్లతో విద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్టు వెల్లడించారు. అమ్మఒడి, జగనన్న విద్యాకానుకలు, ట్యాబ్‌లు, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు పేద కుటుంబాల విద్యార్థుల చదువుకు అండగా నిలుస్తున్నాయన్నారు. ఈ సంవత్సరాంతానికి ప్రతి పాఠశాలలో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. విద్యార్థులు చదువులో మరింతంగా రాణించి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని, ఊరికి, జిల్లాకు, తల్లిదండ్రులకు పేరుతేవాలని పిలుపునిచ్చారు.

- చదువులో ప్రతిభ చూపే విద్యార్థులను ప్రభుత్వం అన్నివిధాలుగా ప్రోత్సహిస్తోందని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పాఠశాల, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సన్మానిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర స్థాయి సన్మానానికి జిల్లా నుంచి కర్రి షర్మిల, పాలక గురునాథ్, ఆరిక నందిని ఎంపికయ్యారని, వారిని ఈ నెల 25వ తేదీన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సత్కరించి నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తారన్నారు. జిల్లా స్థాయిలో వివిధ గ్రూపుల్లో అత్యధిక మార్కులు సాధించిన ఇంటర్మీడియట్ విద్యార్థులు 19 మంది, 24 మంది పాఠశాలల విద్యార్థులకు రూ.50వేలు (ప్రథమ), రూ.30వేలు (ద్వితీయ), రూ.15వేలు (తృతీయ) చొప్పున మొత్తం రూ.17 లక్షలను నగదు బహుమతిగా అందజేశారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు. రాష్ట్ర స్థాయిలో పదో తరగతి ఉత్తీర్ణత శాతంలో మొదటి స్థానం సాధించేందుకు కృషిచేసిన కలెక్టర్, విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులను అభినందించారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో కూడా పార్వతీపురం మన్యం జిల్లాను ఫలితాల్లో ముందంజలో నిలిపేలా విద్యాప్రణాళికను అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, డీఈఓ ప్రేమ్‌కుమార్, జిల్లా ఒకేషనల్ విద్యాశాఖాధికారి మంజులవీణ, ట్రైబల్ వెల్ఫేర్ ఉపసంచాలకులు పి. సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చక్కటి విద్యాబోధన



నాపేరు హేమలత పాడి. నేను పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివాను. పదోతరగతిలో 600కి 587 మార్కులు సాధించాను. పాఠశాల ఉపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన బోధన అందించారు. సీఎం జగన్‌మామ రుచికరమైన భోజనం, అన్ని వసతులు కల్పించడంతో చక్కగా చదువుకో కలిగాను. పేద కుటుంబాల పిల్లల చదువుకు బాసటగా నిలుస్తూ, జగనన్న ఆణిముత్యాలు కింద రూ.50వేలు నగదుబహుమతి అందజేసిన జగన్‌మామకు మరోసారి థాంక్స్ చెబుతున్నా.

చదువులో రాణిస్తా..



నా పేరు కర్రి షర్మిల. నేను ఎంజేపీఏపీ బీసీడబ్ల్యూఆర్ ఈఐఎస్‌లో పదోతరగతి చదివాను. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ప్రభుత్వం నుంచి అందిన సహకారంతో చక్కగా చదువుకున్నాను. పదోతరగతి ఫలితాల్లో 585 మార్కులు సాధించాను. నాతోపాటు నా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను సత్కరించడం చాలా ఆనందంగా ఉంది. మా లాంటి పేదవిద్యార్థుల చదువుకు పెద్దపీట వేస్తున్న జగన్‌మామ రుణం తీర్చుకోలేనిది. భవిష్యత్తులో చదువులో రాణించి సీఎం ఆశయాన్ని నెరవేరుస్తాను.

చదువు బెంగ తీరింది



నా పేరు పాలక ఉమామహేశ్వరరావు. మా అబ్బాయి పాలక గురునాథ్‌ను జీటీడబ్ల్యూఏ ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి చదివించాను. అక్కడ ఉత్తమమైన విద్యను అందించారు. అంతేకాకుండా పౌష్టికాహారాన్ని మెనూ ప్రకారం క్రమం తప్పకుండా అందజేశారు. ఫలితంగా మా అబ్బాయి పదో తరగతిలో 600కు 570 మార్కులు సాధించాడు. పిల్లల చదువుపై బెంగ తీరింది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద కుటుంబాల పిల్లల చదువుకు పెద్దస్థాయిలో పెట్టుబడి పెడుతోంది. ప్రయోజకులను చేసేందుకు కృషిచేస్తోంది. ఆ ఫలితమే ఇది. కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా అందరిముందు సన్మానించడం మరిచిపోలేనిది.

ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యం



గతంలో ప్రభుత్వ బడులంటే చులకనగా చూసేవారు. సదుపాయాలు ఉండవని చదువుకునేందుకు ఎవరూ వచ్చేవారు కాదు. జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి. రూ.కోట్ల ఖర్చుతో పాఠశాలలకు సదుపాయాలు కల్పించడంతో ప్రవేశాలకు విద్యార్థులు మక్కువ చూపుతున్నారు. ప్రతిభావంతులను ప్రభుత్వం ప్రోత్సహించడం శుభపరిణామం. అందుకు కారకులైన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను గౌరవించడం సంతోషదాయకం.

- కె.సుబ్బారావు, జీటీడబ్ల్యూ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం, దోనుబాయి

పక్కాగా డ్రైనేజీ వ్యవస్థ

- కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: జిల్లాలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థను పక్కాగా నిర్మించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. పార్వతీపురం మండలం అడ్డాపుశీలలోని జగనన్న కాలనీ పనులను ఆయన శనివారం పరిశీలించారు. మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. గృహనిర్మాణాలకు లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకొని నిర్మాణాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఉప కార్యనిర్వాహక ఇంజినీరు ప్రసాద్‌ను ఆదేశించారు. అనంతరం కొత్తవలసలోని సచివాలయాన్ని సందర్శించారు. అమ్మఒడి పథక లబ్ధిదారుల జాబితా, బయోమెట్రిక్ తీరుపై ఆరా తీశారు. రిజిస్ట్రేషన్లు, జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం వంటి కార్యక్రమాలు అమలులో సచివాలయ సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు.



అడ్డాపుశీలలో గృహనిర్మాణాల పురోగతిపై ఆరాతీస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

ఐటీఐ ప్రవేశాలకు 192 మంది ఎంపిక



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

విజయనగరం రూరల్: జిల్లాలోని పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లలో ప్రవేశాలకు నాల్గోవ రోజు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. 192 మందికి ప్రవేశాలు కల్పించినట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టి.వి.గిరి తెలిపారు.

నేడు రెండో ఎంఈఓ పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్

విజయనగరం పూల్‌బాగ్: జిల్లా వ్యాప్తంగా రెండో ఎంఈఓ ఖాళీలను బదిలీ పద్ధతిలో భర్తీ చేసేందుకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియారిటీ జాబితాను జిల్లా విద్యాశాఖాధికారి, విజయనగరం వెబ్‌సైట్‌లో పొందుపర్చామన్నారు. జాబితాలో పేరు ఉన్న మండల విద్యాశాఖాధికారులు/ప్రధానోపాధ్యాయులు ఉదయం 11 గంటలకు విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

మహిళాసంఘాల ఉన్నతికి 'స్ఫూర్తి'

- రూ.కోటి వ్యయంతో గిరిజనోత్పత్తులకు బ్రాండింగ్, ప్యాకింగ్, మార్కెటింగ్ సదుపాయాలు
- వైకేపీ వర్క్‌షాప్‌లో రాష్ట్ర పేదరిక నిర్మూలనా సంస్థ డైరెక్టర్ పద్మావతి



మాట్లాడుతున్న సెర్ప్ డైరెక్టర్ పద్మావతి

సీతంపేట: మహిళా సంఘాల అభివృద్ధికి స్ఫూర్తి ప్రాజెక్టు ద్వారా కృషిచేస్తున్నట్టు రాష్ట్ర పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) డైరెక్టర్ పద్మావతి అన్నారు. సీతంపేట ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలోని ఐటీడీఏ వీడీవీకే సభ్యులు, వైకేపీ సిబ్బందితో శనివారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. మహిళల జీవనోపాధుల మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పీఎంఎఫ్ఏ స్కీమ్ కింద రూ.కోటి ఖర్చుతో గిరిజన ఉత్పత్తుల ప్యాకింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్‌కు ప్రత్యేక ప్రాజెక్టును రూపొందిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.50 లక్షలు, మరో రూ.50 లక్షలు సమకూరుస్తుందని తెలిపారు. ఏపీఫుడ్ ప్రాజెక్టు కూడా సహకరిస్తుందన్నారు. ఏడాది కాలంలో జీడీ, పసుపు, పైనాపిల్ ఉత్పత్తుల లభ్యతపై ఆరా తీశారు. స్ఫూర్తి ప్రాజెక్టులో వెయ్యి నుంచి రెండువేల మంది సభ్యులుగా ఉంటారని, వీరు సేకరించిన గిరిజన ఉత్పత్తులను నిల్వ చేసేందుకు, ప్రాసెసింగ్‌కు కోల్డ్ స్టోరేజీ, యంత్రాలతో కూడిన యూనిట్ నెలకొల్పుతామన్నారు. మార్కెటింగ్‌కు సిద్ధంచేసిన ఉత్పత్తులకు సభ్యులే స్వయంగా ధర నిర్ణయించి, వచ్చిన లాభాలను పంచుకోవాల్సి ఉంటుందన్నారు. పైనాపిల్‌తో తయారుచేసే అన్ని ఉత్పత్తులపైన శిక్షణ ఇస్తామని చెప్పారు. ఆయా ఉత్పత్తుల మార్కెటింగ్‌కు వివిధ జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలు, అంతర్జాతీయ స్థాయిలో విక్రయించేలే ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో చేయూత అదనపు డైరెక్టర్ మహిత, పీఎంఎఫ్ఈ అదనపు డైరెక్టర్ సరళ, కేశవ, శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీలు కిరణ్‌కుమార్, విద్యాసాగర్, ఏపీడీ ఆర్‌వీ రమణ, డీపీఎం నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త నిర్వహణలో

25న గ్రూప్-2 ఉద్యోగ పరీక్షలపై
ఉచిత అవగాహన సదస్సు

- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన వారికి నగదు, స్టడీ మెటీరియల్ అందజేత

విజయనగరం అర్బన్: రాష్ట్రంలో భారీ ఎత్తున గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దాదాపు వెయ్యి పోస్టుల వరకు గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగాలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'సాక్షి ఎడ్యుకేషన్.కాం' రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సీ.ఎగ్జామ్స్ కలిసి ఉచిత అవగాహన సదస్సును నిర్వహిస్తోంది. పట్టణంలోని మూడులాంతర్ల జంక్షన్ సమీపాన హోటల్ ఆనంద్ గ్రేండ్ ఫోర్ట్ లో ఈ నెల 25వ తేదీ ఉదయం 9.00 గంటల నుంచి 12.30 వరకు ఈ సదస్సును చేపడుతోంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు 'సాక్షి ఎడ్యుకేషన్.కాం' తోడుగా ఉంటున్న విషయం తెలిసిందే.

లెజండరీ ఫ్యాకల్టీతో...

ఈ అవగాహన సదస్సుకు రాష్ట్రంలోనే లెజండరీ ఫ్యాకల్టీలైన బి.కృష్ణారెడ్డి (పాలిటిక్స్), అబ్దుల్ కరీం (హిస్టరీ), సి.హరికృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ), ఎండీ పాషా (ఎకానమీ), ప్రొఫెసర్ చింతా గణేష్ (సోషియాలజీ), మట్టపల్లి రాఘవేంద్ర (కరెంట్ అఫైర్స్), శంకర్ రెడ్డి (మెంటల్ ఎబిలిటీ), జల్లు సద్గుణరావు (జాగ్రఫీ) లాంటి లెజండరీ ఫ్యాకల్టీలు హాజరుకానున్నారు. అవగాహన సదస్సుతోపాటు.. అదే రోజు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో మంచి ప్రతిభ కనబర్చిన జిల్లా అభ్యర్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నారు. త్వరలోనే వెయ్యికి పైగా గ్రూప్-2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రానుండటం ... దీనికి తోడు గ్రూప్-2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా సెల్: 89850 94499 నంబర్‌కు తమపేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

ఉచిత అవగాహన సదస్సు తేదీ:
ఈ నెల 25

వేదిక:
హోటల్ ఆనంద్ గ్రాండ్ ఫోర్ట్,
ఏ.జీ.రోడ్, మూడు లాంతర్ల జంక్షన్,
విజయనగరం

సమయం:
ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు

వివరాలు పంపించాల్సిన ఫోన్ నంబర్: 89850 94499

క్లుప్తంగా

జాతీయ కాన్ఫరెన్స్‌లో మన ఎమ్మెల్సీలు



జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్సీలు సూర్యనారాయణరాజు, రఘురాజు

విజయనగరం/నెల్లిమర్ల రూరల్: జాతీయ స్థాయిలో ముంబై వేదికగా జరిగిన కాన్ఫరెన్స్‌లో విజయనగరం జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు డాక్టర్ పివివి.సూర్యనారాయణరాజు, ఇందుకూరి రఘురాజు పాల్గొన్నారు. జియో వరల్డ్ కన్వెన్సన్ సెంటర్‌లో మూడు రోజుల పాటు జరిగిన సదస్సులో నియోజకవర్గ అభివృద్ధి సాధనకు మెలకువలు, మార్గాలు, ప్రజలు ఆశించే స్థాయిలో సేవలందించటం, ప్రభుత్వ అధికారులకు సహకరించటం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

అదుపు తప్పి కారుపై పడ్డ ట్రాక్టర్



కారు ముందు భాగంపై పడిన ట్రాక్టర్ కర్రల లోడు

గజపతినగరం : స్థానిక జాతీయ రహదారి వద్ద కర్రల లోడుతూ వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి కారుపై బోల్తా పడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. జాతీయ రహదారిలో గోతులు ఏర్పడడంతో ట్రాక్టర్ అదుపు తప్పి రహదారి గుండా ప్రయాణిస్తున్న కారుపై పడింది. దీంతో కారు కొంత భాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కారులో ఉన్న వారు సురక్షితంగా బయట పడ్డారు. విషయాన్ని తెలుసుకున్న గజపతినగరం పోలీసులు రహదారిలో బోల్తా పడిన ట్రాక్టర్‌ను పక్కకు నెట్టించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

పట్టుబడిన బియ్యం



రేషన్ బియ్యంతో సీజ్ చేసిన ఆటో వద్ద అధికారులు

శృంగవరపుకోట : కొత్తవలస మండలంలోని ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ముసిరాం బీసీ కాలనీ నుంచి ఆటోలో దేవరాపల్లికి బియ్యం తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో కొత్తవలస సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ రమేష్ తన సహచర ఉద్యోగులతో కలిసి ఆటోను అడ్డుకుని 3.20 క్వింటాళ్ల ప్రజా పంపిణీ బియ్యాన్ని సీజ్ చేశారు. బియ్యం రవాణా చేస్తున్న గాలి ఉమామహేశ్వరరావుపై 6ఏ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. సీజ్ చేసిన బియ్యం కొత్తవలస ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించామని వివరించారు. వీఆర్వో శ్రీనివాసరావు, మహిళా కార్యదర్శి అనూష తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన...

కిమ్మి - రుషింగి వంతెన

- పూర్తయిన వంతెన పనులు
- 11 ఏళ్ల తరువాత వైఎస్సార్‌సీపీ చొరవతో పనులు పూర్తి
- రూ.29.5 కోట్ల నాబార్డు నిధులతో చేపట్టిన పనులు
- జూలైలో వాడుకలోకి రానున్న వంతెన



వంతెనకు ఇరువైపులా జరుగుతున్న అప్రోచ్ రోడ్డు పనులు



అందుబాటులోకి రానున్న కిమ్మి - రుషింగి వంతెన

వీరఘట్టం: పదకొండేళ్లగా ఈ ప్రాంత ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్న కిమ్మి - రుషింగి వంతెన పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధమైంది. రెండు నెలల కిందట వంతెన పనులు పూర్తి కాగా వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డును కొద్ది రోజులు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులు కూడా చివర దశకు చేరుకున్నాయి. మరో వారం రోజుల్లో రోడ్డు పనులు పూర్తి కానున్నాయని, జూలై నెలలో వాడుకలోకి వస్తుందని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. వీరఘట్టం - వంగర మండలాల మధ్య కిమ్మి, రుషింగి గ్రామాలకు అనుసంధానం చేస్తూ నాగావళి నదిపై 2012లో రూ.29.5 కోట్ల నాబార్డు నిధులతో కిమ్మి - రుషింగి బ్రిడ్జి పనులు చేపట్టారు. అప్పటి నుండి చేపడుతున్న పనులు ఈ ఏడాది కొలిక్కి వచ్చాయి. తమ ఆశల సౌధం సిద్ధమవుతుండడంతో ఈ రెండు మండలాల సంబరపడుతున్నారు. రెండు నెలల క్రితం వంతెన నిర్మాణం పూర్తి కావడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ఆటోలు వంతెన పైనుండి ప్రయాణాలు చేస్తున్నారు. వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు పనులు జరుగుతుండడంతో పాదచారులకు తప్ప వాహన ప్రయాణాలు నిలిచిపోయాయి. అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేసి వంతెనను వాడుకలోకి తీసుకువచ్చేందుకు అధికారులు పనుల్లో వేగం పెంచారు.

ఇదీ కిమ్మి–రుషింగి చరిత్ర

నాగావళి నదిలో కిమ్మి - రుషింగి గ్రామాల మధ్య 2008లో జరిగిన పడవ ప్రమాదం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ విషాద ఘటనకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అనుకున్నట్లుగానే అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వైఎస్సార్ మరణానంతరం అప్పటి సీఎం నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి రూ.29.5 కోట్లు నాబార్డు నిధులు మంజూరు చేశారు. 2012లో శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వచ్చినపుడు కొత్తూరు మండలంలో రిమోట్ శంకుస్థాపన చేశారు. తర్వాత పనులు ప్రారంభమయ్యాయి. అయితే 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం చిత్తశుద్ధి చూపకపోవడంతో కిమ్మి - రుషింగి వంతెన పనుల్లో వేగం తగ్గింది. తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణంపై దృష్టి సారించడంతో పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేసింది. ఈ నాలుగేళ్లలో మిగిలిన వంతెన పిల్లర్లు, శ్లాబు పనుల్లో వేగం పెంచి వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసింది. ప్రస్తుతం జరుగుతున్న అప్రోచ్ రోడ్డుతో పాటు వంతెనకు పెయింటింగ్స్ వేస్తే ఇక గుమ్మడి కాయ కొట్టేయవచ్చునని అధికారులు చెబుతున్నారు.

ఇలా వంతనె నిర్మాణం

వంతెన నిర్మాణానికి 2 అపార్టుమెంట్లు, 15 ఫిల్లర్లు, 16 శ్లాబులతో డిజైన్ చేశారు. 2014 మార్చి నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉంది. అయితే అప్పటికి 75 శాతం పనులు పూర్తయినప్పటికీ 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వ నిర్లక్షంతో పనులు ముందుకు సాగలేదు. తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో నేడు పనులు పూర్తయ్యాయి. జూలై నెలలో వంతెనను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

> **ప్రారంభానికి సిద్ధం**
>
> కిమ్మి - రుషింగి వంతెన పనులు రెండు నెలల క్రితం పూర్తయ్యాయి. వంతెన ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ప్రస్తుతం అప్రోచ్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ నెలాఖరుకు పెయింటింగ్స్, రివిట్‌మెంటు, వింగ్ వాల్స్ పనులు పూర్తవుతాయి. జూలై నెలలో ప్రారంభించి పూర్తి స్థాయిలో వంతెనను అందుబాటులోకి తీసుకువస్తాం.
>
> – బి.గౌరీశ్వరరావు, డీఈఈ, ఆర్‌అండ్‌బీ

పోలవరంతో కొండగండ్రేడును సస్యశ్యామలం చేస్తాం..

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గుర్ల: పోలవరం ప్రాజెక్టుతో గోదావరి జలాలను కొండగండ్రేడు తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొండగండ్రేడులో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. గత ప్రభుత్వం మాదిరి సంక్షేమ పథకాలకు జన్మభూమి కమిటీలు చుట్టూ ప్రదక్షిణలు చేయనవసరం లేకుండా పని చేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలు ఆమలులో దళారీలు, మధ్యవర్తిత్వం అవసరం లేకుండా అర్హత సాధించిన లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. కొండగండ్రేడు సచివాలయం పరిధిలో నాలుగేళ్లలో సుమారుగా రూ.12 కోట్లు నగదును ప్రజలకు సంక్షేమ పథకాల రూపంలో అందించామన్నారు. భూ సమస్యలకు చెక్ పెట్టేందుకు భూములు రీసర్వేను మరో నెల రోజుల్లో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు సమస్యలు ఉంటే జగనన్న సురక్ష కార్యక్రమంలో తెలియజేస్తే వాటిని పరిష్కారిస్తామన్నారు. ఈనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణ రాజు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, బోళ్ల సుబ్రమణ్యం, తోట తిరుపతిరావు, అంబల్ల చిన్నారావు, సర్పంచ్ సారిక గోవింద్, ఎంపీటీసీ మణ్యపురి రామారావు, కెంగువ మధుసూదనరావు, ఎంపీడీఓ కల్యాణి, తహసీల్దార్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

విజయనగరం క్రైమ్: రెవెన్యూ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి లక్షల రూపాయలు కాజేసిన వైనం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ సమీపంలో నివాసం ఉంటున్న జి.రాధికకు విద్యాశాఖలోగానీ, రెవెన్యూ శాఖలోగానీ ఉద్యోగం ఇప్పిస్తానని కంటోన్మెంట్ సీటీకాలనీకి చెందిన బర్రె కిరణ్‌కుమార్ ఆశ చూపించాడు. ఆమె నుంచి రూ. 2.40 లక్షలు తన అకౌంట్‌కి దఫదఫాలుగా బదిలీ చేయించుకున్నాడు. రోజులు గడుస్తున్నా ఎటువంటి ఉద్యోగం లేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి, రాధిక పోలీసులను ఆశ్రయించింది. వన్‌టౌన్ ఎస్‌ఐ ఆర్.గోపాలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



అభ్యర్థులకు సూచనలిస్తున్న పీటీసీ ప్రిన్సిపాల్ ఆనందబాబు

విజయనగరం క్రైమ్: ఆర్మీలో చేరబోయే అభ్యర్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని పీటీసీ ప్రిన్సిపాల్ టి.ఆనందబాబు పిలుపునిచ్చారు. అగ్నివీర్ పథకంలో భాగంగా ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో ఉత్తీర్ణులైన ఉమ్మడి జిల్లాకు చెందిన 40 మందికి దేహదారుఢ్య పరీక్షలకు సంబంధించి రాజీవ్ క్రీడా మైదానంలో నిర్వహించే ఉచిత రెసిడెన్షియల్ శిక్షణా శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జిల్లా వేదికగా వచ్చే నెలలో పోలీస్ శిక్షణా కళాశాల మైదానంలో నిర్వహించే పరీక్షలకుగానూ ఏర్పాటు చేసిన ఉచిత శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు ఉద్యోగం పొందేందుకుగానూ కావాల్సిన ప్రత్యేక మెలకువలు, సూచనలు చేసి వారిని ప్రోత్సహించారు. పీటీసీ నుంచి శిక్షణనిచ్చేందుకు ఒక ఆర్‌ఎస్‌ఐ, కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేశారు. అభ్యర్థులందరూ ఆర్మీ కొలువులు సాధించాలని ఆకాంక్షించారు.



సంస్కృత కళాశాలలో ఆన్‌లైన్ ప్రవేశాలు

విజయనగరం టౌన్: మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ఉత్తీర్ణులైన వారందరూ బీఏ (ఓఎల్) తెలుగు, సంస్కృతం, బీఎస్సీ కంప్యూటర్ విభాగాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పి. గౌరీశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- రూ.92వేల నగదు సీజ్, 9 మంది జూదరుల అరెస్ట్



పేకాటలో దొరికిన నిందితులతో ఎస్ఐ నారాయణరావు, పోలీస్ సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పారసాం సమీపంలో పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం రాత్రి దాడి చేసి 9 మంది పేకాటరాయళ్లను అరెస్ట్ చేసి అధిక మొత్తంలో నగదు సీజ్ చేశారు. ఎస్ఐ పిసిని నారాయణరావు శనివారం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పారసాం పరిసర ప్రాంతాల్లో పేకాట శిబిరం నడుస్తున్నట్లు ముందస్తు సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలిసి రాత్రి సమయంలో రెక్కీ నిర్వహించామని చెప్పారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ.92,280 నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు. తొమ్మిది మందిపై కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు నిమిత్తం కోర్టుకు అప్పగించామని వెల్లడించారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా:

పారసాం, చంద్రంపేట, ఎల్ఎన్ పురం, టిక్కలి పరిసర ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. రహదారి నిర్మానుష్యంగా ఉండడంతో తరుచూ సమీప లే అవుట్‌లతో పాటు పరిసర ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. పోలీసులు పూర్తి స్థాయిలో నిఘా పెట్టి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: అప్పుల బాధలు తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు సేవించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కంటోన్మెంట్‌లో నివాసం ఉంటున్న చెన్నా శంకరరావు(30) అప్పుల బాధ తాళలేక, బొగ్గులదిబ్బ సమీపంలో ఉన్న చెట్టు కింద ఈ నెల 15న పురుగుల మందు సేవించాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ గోపాలరావు తెలిపారు.

మహిళా పోలీసులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: మహిళా పోలీసులు అన్ని రంగాల్లోనూ రాణించే విధంగా శిక్షణ తీసుకోవాలని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఇంటిలిజెన్స్, స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటూ పీటీసీలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా శనివారం హాజరయ్యారు. శిక్షణ తీసుకున్న వారంతా తెలివితేటలతో, ఆలోచనలతో అధికారుల మెప్పు పొందాలన్నారు. పీటీసీ ప్రిన్సిపల్ టి.ఆనందబాబు మాట్లాడుతూ ప్రతి జిల్లా నుంచి 8 మంది చొప్పున మొత్తం 52 మంది మహిళా సిబ్బంది వివిధ ర్యాంకుల్లో ఈ శిక్షణకు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌జీ డిప్యూటీ డైరెక్టర్ డి.ఆశీర్వాదం, పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ వివి.అప్పారావు, డీఎస్పీలు వివి.అప్పారావు, సిహెచ్‌వి.రామారావు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,110–00
బంగారం(22సి. 10గ్రా.)	55,100–00
వెండి (కిలో)	78,800–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹158	₹286	₹ 296